క్లుప్తంగా

మండలానికి చేరిన విద్యార్థి కిట్లు



పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం

పాణ్యం : 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు మండలానికి వచ్చాయి. వాటిని శుక్రవారం ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 46 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయన్నారు. వీరికి పాఠ్యపుస్తకాలు, బ్యాగ్,షూ, నోట్ పుస్తకాలు, బెల్ట్, యూనిఫామ్‌లు అందించాల్సి ఉందన్నారు. అయితే ప్రస్తుతం పాఠ్య పుస్తకాలు 21,913 రాగా ఇంకా 11,000 రావాల్సి ఉందన్నారు. బ్యాగ్‌లు 4,580 వచ్చాయన్నారు. అలాగే నోట్ పుస్తకాలు ఇప్పటి వరకు 30,718 వచ్చినట్లు తెలిపారు. యూనిఫాంలు 4,580 రావాల్సి ఉందని తెలిపారు.

కుట్టు శిక్షణ కేంద్రం తనిఖీ



మహిళలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి

కల్లూరు: ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కల్లూరులో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. భవనంలో ఇస్తున్న శిక్షణ గురించి అక్కడి మహిళలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో శిక్షణ పొందుతున్న మహిళలకు అందిస్తున్న మౌలిక వసతులను, సదుపాయాలను పరిశీలించారు.

సైన్స్ పరీక్షకు 50 మంది గైర్హాజరు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్లో జరుగుతున్న పదవ తరగతి సప్లిమెంటరీ సైన్స్ పరీక్షకు శుక్రవారం 50 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. స్థానిక మోడల్ స్కూల్లో ఐదవ రోజు 118 మంది విద్యార్థులకు గాను 92 మంది హాజరైనట్లు పరీక్షల నిర్వహణ చీఫ్ అధికారి ధనుంజయ గౌడ్ తెలిపారు. అదే విధంగా సి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 155 మంది విద్యార్థులు సైన్స్ పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 24 మంది గైర్హాజరు అయినట్లు పరీక్షల నిర్వహణ అధికారి వెంకటరమణ తెలిపారు.

ఉపాధి పనులపై విచారణ

పాణ్యం : మండల పరిధిలోని తమ్మరాజుపల్లె ఉపాధి పథకం పనుల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టినట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన వినతులు మేరకు విచారణ చేపడుతున్నామని చెప్పారు. అలాగే లిఖితపూర్వకంగా ఫిర్యాదులు అందాయని, పనులకు వెళ్లని వారికి కూడా మస్టర్ నమోదు చేసి ప్రజాధనాన్ని వృథా చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో వెంటనే విచారణ చేయాలని ఏపీఓకు సూచించినట్లు తెలిపారు. నివేదిక రాగానే ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

పేదల పెన్నిధి వైఎస్ రాజారెడ్డి



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బైజుబాబు

కర్నూలు(హాస్పిటల్): బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి వైఎస్ రాజారెడ్డి ఎంతో కృషి చేశారని, ఆయన పేదల పాలిట పెన్నిధి అని వైఎస్ రాజారెడ్డి ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.ఎస్.బైజుబాబు అన్నారు. శుక్రవారం స్థానిక ఐటీసీ ఎదురుగా ఉన్న స్వామినగర్‌లో వైఎస్ రాజారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజారెడ్డి 27వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మానసిక రోగులు, కుష్టు వ్యాధిగ్రస్తులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిశోర్, రవిగౌడ్, వెంకటేష్, దాదా పీర్, రంగ పాల్గొన్నారు.

ముగిసిన బ్లూ కప్ ఫుట్‌బాల్ పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న బ్లూ కప్ ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. ఆరు జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఫైనల్ పోటీలో లక్ష్య టీమ్ 1-0 గోల్‌తో విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన జట్టుకు ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, విజయ్‌కుమార్ కోచ్ బ్రహ్మకుమార్ కప్ అందజేశారు.

మళ్లీ ప'రేషాన్'!

- ఇంటింటికి బియ్యం పంపిణీకి కూటమి ప్రభుత్వం మంగళం
- ఎండీయూ వాహనాల రద్దు
- మళ్లీ రేషన్ దుకాణాల ముందు పడిగాపులే
- ఉపాధి కోల్పోతున్న ఆపరేటర్లు, హెల్పర్లు



వాహనం ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

కల్లూరు: కూటమి ప్రభుత్వం ఇంటి వద్దకే బియ్యాన్ని పంపిణీ వ్యవస్థకు మంగళం పాడింది. జూన్ నెల నుంచి రేషన్ దుకాణాల ద్వారానే రేషన్ ఇతర సరుకులు అందించనున్నట్లు మంత్రి వర్గ ఉప సంఘం నిర్ణయం తీసుకుంది. దీనివల్ల కార్డుదారులు మళ్లీ సరుకుల కోసం రేషన్ దుకాణాల ముందు క్యూలైన్లో నిలబడాల్సిన దుస్థితి దాపురించింది. అలాగే ఎండీయూ వాహనాల ఆపరేటర్లు, హెల్పర్లు ఉపాధి కోల్పోయారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటివద్దకే రేషన్

ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల ఇంటి ముంగిటకే వాహనాల ద్వారా నిత్యావసర వస్తువులను అందజేసేందుకు ఎండీయూ వాహనాలను తీసుకువచ్చింది. తద్వారా ప్రజలు బియ్యం తదితర నిత్యావసర వస్తువుల కోసం రేషన్ దుకాణాల ముందు క్యూలైన్లో (వరుసలో) నిలబడాల్సిన అవస్థలు తప్పాయి. ఎంచక్కా రేషన్ కార్డుదారులు ఇంటి దగ్గరకి వచ్చిన వాహనంలో బియ్యాన్ని తీసుకునేవారు. దీనివల్ల కార్డుదారులకు వ్యయ ప్రయాసలుండేవి కాదు. అలాగే నియోజకవర్గంలోని 43 వాహనాల ద్వారా ఎండీయూ ఆపరేటర్లు, వారి హెల్పర్లు జీవనోపాధి పొందేవారు. బియ్యం పంపిణీ వాహనాలు తీసివేయడంతో ఎండీయూ ఆపరేటర్లు, హెల్పర్లు ఇబ్బందులు పడాల్సివస్తుంది.

పాణ్యం నియోజకవర్గంలో రేషన్ లబ్ధిదారుల వివరాలు

మండలం	రేషన్ కార్డులు	రేషన్ దుకాణాలు	ఎండీయూ వాహనాలు
పాణ్యం	14, 994	32	9
గడివేముల	13, 839	32	9
ఓర్వకల్లు	18,672	35	12
కల్లూరు (గ్రామీణ)	20,657	36	13

వాహనాలతోనే రేషన్ అందించాలి



రేషన్ సరుకులను వాహనలతోనే ఇంటింటికి అందించాలి. తండా నుంచి తడకనపల్లెలోని రేషన్ దుకాణానికి వచ్చి రేషన్ సరుకులు తెచ్చుకోవాలంటే సుమారుగా మూడు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుంది. దీని వల్ల ప్రతి నెలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. గత ప్రభుత్వం మాదిరిగానే బియ్యం బండి ద్వారానే బియ్యం పంపిణీ చేయాలి.

– ఎస్. పెద్ద లక్ష్మీబాయి, ఓబులాపురం తండా

మళ్లీ కష్టాలు పడాల్సి వస్తుంది



రేషన్ సరుకులు రేషన్ సరుకులు దుకాణాల నుంచే తీసుకోవాలంటే మళ్లీ కష్టాలు పడాల్సి వస్తుంది. బియ్యం పంపిణీ వాహనాలతోనే ఇంటింటికి సరుకులు అందించాలి. దుకాణాల ద్వారా సరుకులు తీసుకోవాలంటే పనులు వదులుకొని గంటలకొద్దీ క్యూలైన్లో నిలబడాల్సి వస్తుంది. ప్రభుత్వం ఆలోచించి ఇంటింటికి బియ్యం పంపిణీ చేసే వాహనాలను కొనసాగించాలి.

– తలారి బాలచిన్ని, గడివేముల

పకడ్బందీగా రేషన్ పంపిణీ



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం

సి.బెళగల్: రేషన్ పంపిణీని పకడ్బందీగా చేపట్టాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం డీలర్లకు ఆదేశించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మండల రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వచ్చే నెల ఒకటో తేది నుంచి రేషన్‌దుకాణాల వద్ద సరుకుల పంపిణీ జరుగుతుందన్నారు. డీలర్లు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంకాలం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తప్పకుండ రేషన్ పంపిణీ చేపట్టాలన్నారు. 65 సంవత్సరాలు నిండిన లబ్ధిదారులకు వారి ఇళ్ల దగ్గరే ప్రతి నెల 5వ తేదీలోగా రేషన్ సరుకులు అందజేయాలని డీలర్లకు సూచించారు. నిబంధనలు పాటించని డీలర్లపై చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ చిరంజీవి

సి.బెళగల్: గృహ నిర్మాణాల్లో పురోగతి కనిపించేలా మండల అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా హౌసింగ్ పీడీ చిరంజీవి ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ రంగనాథ బాబు, మండల అధికారులతో కలిసి గృహ నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బురాన్‌దొడ్డి, కంబదహాల్, కొండాపురం గ్రామాల్లో జరుగుతున్న గృహ నిర్మాణాల పురోగతిపై హౌసింగ్ ఏఈ సుమంత్, ఆయా గ్రామాల సచివాలయాల ఇంజినీర్లు, పంచాయతీ కార్యదర్శులతో చర్చించారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర మాసోత్సవాన్ని అధికారులు విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ రంగనాథ బాబు అన్నారు. మండలంలో యోగా కార్యక్రమాల నిర్వహణపై శుక్రవారం ఎంపీడీఓ రాణెమ్మతో కలిసి ఆయన మండల అధికారుల, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం, ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి, ఎంఈఓ జ్యోతి, పోలకల్ పీహెచ్‌సీ డాక్టర్ అనీస్, వెలుగు ఏపీఎం రామేశ్వర్, ఉపాధి హామీ ఏపీఓ రామన్న, ఐసీడీఎస్, హెల్త్ సూపర్ వైజర్లు సుజాత, మంగమ్మ తదితరులు హాజరయ్యారు.

వివాహ వేడుకలో..

కోడుమూరు రూరల్: కోడుమూరులో వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకుడు గద్వాల మహమ్మద్ రఫీక్ కు మారుడి వివాహ వేడుకకు కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశ్వీరదించారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ ఉపసర్పంచు ప్రవీణ్ కుమార్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు మండలంలోని ఎర్రదొడ్డి గ్రామంలో జరిగిన రెండు వివాహ కార్యక్రమాల్లోనూ కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశ్వీరదించారు.

- మండల కేంద్రం సి.బెళగల్లో వైఎస్సార్‌సీపీ నాయకుడు బలిగేరి వెంకటేష్ కుమారుడు హరికృష్ణ వివాహానికి కుడా చైర్మన్ కోట్లహర్ష హాజరయ్యారు. ఆయన వెంట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు నరసింహుడు, మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, కోడుమూరు జెడ్పీటీసీ రఘునాథరెడ్డి, నాయకులు క్రిష్టారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శులు బాయికాటి మద్దిలేటి, వెంకటేష్, గోపాల్, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ ఎస్ ఎంబాషా, సర్పంచ్ పాండురంగన్న, తెలుగు దస్తగిరి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ నిర్ణయంతో జీవనోపాధి దూరం



కాటసాని రాంభూపాల్‌రెడ్డికి వినతి పత్రమిస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

కల్లూరు: ఇంటింటికీ రేషన్ పంపిణీ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేయడం వల్ల ఆపరేటర్లు, హెల్పర్లు జీవనోపాధి కోల్పోతారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు గ్రామీణ, అర్బన్ ప్రాంతాలకు చెందిన ఎండీయూ ఆపరేటర్లు కాటసాని రాంభూపాల్‌రెడ్డిని ఆయన స్వగృహంలో కలిశారు. తమ పోరాటానికి మద్దతు తెలపాలని, తమకు అండగా నిలవాలని కోరారు. కాటసాని మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు ఇంటి ముంగిటకే రేషన్ సరుకులు అందించాలని ఉద్దేశంతో ఎండీయూ వాహనాలు తీసుకువచ్చిందన్నారు. ఈ వ్యవస్థను ఏర్పాటు చేసి రాష్ట్రంలో ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించిందన్నారు. దీనిని ప్రభుత్వం రద్దు చేయడం సరైందికాదన్నారు.

శుభకార్యం



వధూవరులతో కాటసాని

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలో జరిగిన పలు శుభకార్యాలకు నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరయ్యారు. పాణ్యం గ్రామానికి చెందిన ఓబులేసు కుమారుడు వివాహానికి హాజరై వధూవరులను ఆశ్వీర్వదించారు. అలాగే పాణ్యంలో ఓ గృహప్రవేశంలో పాల్గొన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ అధ్యక్షుడు రామలక్ష్మయ్య, పాణ్యం ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

గడివేముల:మండల పరిధిలోని ఎల్‌కే తండా గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ కాలునాయక్ కుమారుడి వివాహానికి నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి శుక్రవారం హాజరయ్యారు. వధూవరులు సాయికుమార్ నాయక్, అంజలిలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్లారెడ్డి, అనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్కువ సేపు కూర్చుని పనిచేస్తే వ్యాధులు



ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది, చిత్రంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): శారీరక వ్యాయామం లేకుండా ఒకేచోట ఎక్కువసేపు కూర్చొని పనిచేస్తే వ్యాధులు దరిచేరతాయని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ చెప్పారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ మాట్లాడుతూ.. జీవనశైలి, ఆహార మార్పులతో ఎక్కువ మంది అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. రక్తపోటు, షుగర్, క్యాన్సర్‌తో పాటు ఇతర వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని చెప్పారు. ఆహార పద్ధతి, శ్రమాధారిత జీవనశైలితోనే మన పూర్వీకులు పూర్తి ఆరోగ్యంగా ఉండేవారని తెలిపారు. ఆహార నియమాలు పాటిస్తూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, ఆహారంలో ఉప్పు తగ్గించుకోవాలని, పచ్చళ్లు, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తగ్గించాలని చెప్పారు. కార్యాలయ సిబ్బంది ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారందరూ రక్తపోటు, మధుమేహం వంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎన్‌సీడీ అధికారి డాక్టర్ శైలేష్‌కుమార్, సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు, కార్యాలయ పరిపాలనాధికారి అరుణ, డెమో శ్రీనివాసులు, ఆర్‌బీఎస్‌కే కన్సల్టెంట్ మల్లికార్జున, సత్యనారాయణ, ఎన్‌సీడీ ఫైనాన్స్ కన్సల్టెంట్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు విద్యుత్ శాఖ క్యాంప్స్ సెక్షన్ పరిధిలో 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనులు చేపడుతున్న ందున శనివారం విద్యుత్ సరఫరాకు అంతరా యం కలుగుతుందని కర్నూలు అర్బన్ ఈఈ టీ.శేషాద్రి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. డీఐజీ బంగ్లా, మహాలక్ష్మి నగర్, సోమప్ప కాలనీ, డాక్టర్స్ కాలనీ, అరోరా నగర్, బి.క్యాంపు, హౌసింగ్ బోర్డు కాలనీ తదితర కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వెల్లడించారు.

బీచ్ సెపక్‌తక్రాలో కాంస్యం



కాంస్య పతకం సాధించిన ఏపీ సెపక్‌తక్రా మహిళల జట్టు

కర్నూలు (టౌన్): కేంద్ర పాలిత ప్రాంతమైన డయ్యూలో నిర్వహించిన ఖేలో ఇండియా బీచ్ సెపక్‌తక్రా మహిళల డబుల్స్ పోటీల్లో ఆంధ్ర ప్రదేశ్ బాలికల జట్టు కాంస్య పతకం సాధించింది. తొలి రౌండ్‌లో గుజరాత్‌పై 2-0 స్కోర్‌తో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. తర్వాత ఢిల్లీతో తలపడి 2-0 స్కోర్‌తో విజయం సాధించి సెమీ ఫైనల్‌కు చేరుకుంది. ఒరిస్సా మహిళల జట్టుపై పోరాడి మూడవ స్థానంలో నిలిచి కాంస్యం గెలుచుకుందని సెపక్ తక్రా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పతకం సాధించిన వారిలో కర్నూలుకు చెందిన అపర్ణ, కడపకు చెందిన హరికారెడ్డి, ప్రకాశం జిల్లాకు చెందిన శివానీ ఉన్నారు.

లలితా సుందరేశ్వర స్వామి కల్యాణోత్సవం

కర్నూలు కల్చరల్: కర్నూలు ఓల్డ్‌సిటీ లలితా పీఠంలో శుక్రవారం లలితా సుందరేశ్వర స్వామి వార్ల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. లలితా సుందరేశ్వరస్వామి దశమ ప్రతిష్ఠాపన వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవ మూర్తులు, మూల విరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం శ్రీలలితా సుందరేశ్వర స్వామి వార్ల కల్యాణ మహోత్సవం, రథోత్సవం, మహా అన్న ప్రసాదం కార్యక్రమాలు జరిగాయి. మహిళల కోలాటం, భజనలు, నృత్యాలు అలరించాయి. లలిత పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్య స్వామి సందేశం ఇచ్చారు.

ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు టీవీ రమేష్ బాబు

కర్నూలు(రూరల్): గ్రామాల్లో అర్హులైన పేదలు ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోవాలని కర్నూలు రూరల్ తహసీల్దారు టీవీ రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో వీఆర్‌వోల తో సమావేశమై మాట్లాడారు. జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల నుంచి నిత్యావసర సరుకుల పంపిణీ జరుగుతుందన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించాలని గ్రామ అధికారులకు సూచించారు. అలాగే మండలంలో ఎవరైనా అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లను నిర్మించుకుంటే క్రమబద్ధీకరిస్తున్నట్లు చెప్పారు. మండల పరిధిలోని 9 గ్రామాల్లో కేసీ నీటిని వినియోగించుకునే రైతుల నుంచి పన్నులు వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు.

కోడుమూరు టీడీపీలో అసమ్మతి సెగ

- తమకు గుర్తింపు లేదంటూ కోట్ల వర్గీయుల ఆవేదన

కోడుమూరు రూరల్: కోడుమూరు టీడీపీలో అసమ్మతి సెగ చర్చనీయాంశంగా మారింది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా తమను ఎమ్మెల్యే గానీ, ఎంపీ గానీ పట్టించుకోవడం లేదంటూ డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి వర్గీయులు శుక్రవారం సాయంత్రం కోడుమూరులో టీడీపీ రాష్ట్ర అధికార మహిళా ప్రతినిధి సీబీ లత స్వగృహంలో సమావేశమై భవిష్యత్ కార్యచరణపై చర్చించారు. ఈ సందర్భంగా సీబీ లత, సీనియర్ నాయకులు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీని గెలిపించుకునేందుకు తాము శాయశక్తులా కృషి చేస్తే నేడు పార్టీ అధిష్టానం పట్టించుకోవడం లేదన్నారు. తమను పూర్తిగా పక్కకు పెట్టి పార్టీ జిల్లా, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, ఎమ్మెల్యే, ఎంపీలు ఏకపక్షంగా రాజకీయాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలపై తమకు కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలులో జరిగిన జిల్లా మహానాడు సభకు సైతం తమను ఆహ్వానించలేదన్నారు. ఈ విషయాలపై మహానాడులో పార్టీ అధ్యక్షుడికి ఫిర్యాదు చేసేందుకు తాము సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. సమావేశంలో కోడుమూరు సర్పంచు భాగ్యరత్న, టీడీపీ మండల కన్వీనర్ కోట్ల కవితమ్మ, సీనియర్ నాయకులు హేమాద్రిరెడ్డి, కేఈ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండను లాగుతున్న వృషభాలు

ఓర్వకల్లు : మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలు హోరాహోరీగా సాగాయి. హనుమజ్జయంతి సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో మొత్తం 13 జతల ఎడ్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలలో నాగర్కర్నూలు జిల్లా, లింగాల మండలం, రాయవరం అక్షరారెడ్డి వృషభాలు తొలి బహుమతి రూ.60 వేలను కైవసం చేసుకోగా, కర్నూలు మండలం, బి.తాండ్రపాడు గ్రామానికి చెందిన ఆకెపోగు చిన్నరత్నం వృషభాలు రెండవ బహుమతి రూ.40 వేలను దక్కించుకున్నాయి. కోడుమూరు మండలం, వెంకటగిరికి చెందిన శశాంక్, శ్రేయ వృషభాలు మూడవ బహుమతి రూ.30 వేలు, గద్వాల జిల్లా, ఉండవల్లి మండలం, కంచుపాడుకు చెందిన అంజిరెడ్డి వృషభాలు నాల్గవ బహుమతి రూ.20 వేలను సాధించుకున్నాయి. బనగానపల్లె మండలం, రామతీర్థం నాగపుల్లయ్య, నంద్యాల జిల్లా, దొర్నిపాడుకు చెందిన కిట్టన్న (విడి జత) వృషభాలు ఐదవ బహుమతి 15 వేలు, కర్నూలు మండలం, పసుపుల శేఖర్, నంద్యాల జిల్లా, కొణిదేలకు చెందిన దండు రైడర్స్(విడిజత) వృషభాలు ఆరవ బహుమతి రూ.10 వేలు, కోడుమూరు మండలం, వెంకటగిరికి చెందిన బీఎల్‌కే వృషభాలు ఆరవ బహుమతి రూ.5 వేలు గెలుచుకున్నాయి. పోటీలకు వాడాల రామనాయుడు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

డిమాండ్లు నెరవేర్చే వరకు ఆందోళన



గూడూరులో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న నగర పంచాయతీ కార్మికులు

కోడుమూరు రూరల్: తమ న్యాయమైన డిమాండ్లను సర్కారు నెరవేర్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని గూడూరు నగర పంచాయతీ కార్మికులు అన్నారు. ఆందోళన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వారు వినూత్న రీతిలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు అరవింద్, మధు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో ఏళ్ల తరబడి పని చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువులకు అనుగుణంగా ప్రతి కార్మికుడికి టెక్నికల్, నాన్ టెక్నికల్ ఆధారంగా నెలకు రూ.29,200 నుంచి రూ.24,500 వరకు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే 15 సంవత్సరాలు పైబడి పనిచేస్తున్న వారిని పర్మనెంటు చేయాలని, జీతాలు సైతం నెలనెలా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గత వారం రోజుల నుంచి విధులను బహిష్కరించి నిరవధిక దీక్ష చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కార్మికులు దూకేశ్వరరావు, షబ్బీర్, బసవరాజు, జయన్న, ఖాజాహుసేన్, హరి, పఠాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఓడీఎస్‌కు గురైన బాలికకు మెరుగైన వైద్యం

కర్నూలు(హాస్పిటల్): మల్టీ ఆర్గాన్ డిస్‌ఫంక్షన్ సిండ్రోమ్(ఎంఓడీఎస్)కు గురైన బాలికకు మెరుగైన వైద్యం అందించిన ప్రాణంపోసినట్లు కర్నూలులోని కిమ్స్ కడల్స్ హాస్పిటల్‌కు చెందిన పీడియాట్రిషన్ డాక్టర్ నవీన్‌రెడ్డి చెప్పారు. ఆయన శుక్రవారం చికిత్స వివరాలు వెల్లడించారు.అనంతపురం జిల్లా గుంతకల్లు ప్రాంతానికి చెందిన 14ఏళ్ల బాలికకు ముందుగా జ్వరం, దగ్గు, కడుపునొప్పి మొదలయ్యాయని, రెండోరోజే ఆమె పరిస్థితి విషమించిందన్నారు. ఆమెను స్థానికంగా ఒక ఆసుపత్రికి తీసుకెళ్లగా బీపీ(60/30) పూర్తిగా పడిపోయిందని గుర్తించి అక్కడి వైద్యులు కర్నూలు కిమ్స్‌కు రెఫర్ చేశారన్నారు. బాలికను ఆసుపత్రికి తీసుకొచ్చే నాటికే బహుళ అవయవాలు విఫలమై తీవ్ర ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిపోయిందన్నారు. ఇన్‌ఫెక్షన్ వల్ల ఇలాంటి పరిస్థితి వస్తుందని చెప్పారు. ఆ బాలికను వెంటిలేటర్‌పై ఉంచి అవసరమైన చికిత్స అందించామన్నారు. కంటిన్యూస్ కిడ్నీ రీప్లేస్‌మెంట్ థెరపీ, వైద్యచికిత్సలతో బాలిక కోలుకుందని చెప్పారు.